# నాటకకళాపరిషత్తు

గుంటూరు-౧౯౩౦.

గుంటూరులోను జరిగిన ఆంధ్రనాటకకళా పరిషత్సమావేశమున, తదధ్యక్షులు శ్రీ హరీంద్రనాథచట్టోపాధ్యాయగారు భారతదేశమున సరియైన నాటకశాలలే లేవనియు, ఇతరదేశములు నాటకశాలలు ఎట్టి యల్లరి ప్రదేశాలలో నున్నను వెలుపలిధ్వని లోని వారికి వినబడని పద్ధతిని కట్టబడియుండుననియు, రంగస్థలము అనేకవిధములుగ క్రిందికి పైకి దింపుటకు, ఎత్తుటకు వీలయినవి, ఏవైపు కయినా తిరుగుటకువీలయినవి, పెక్కుభాగము లుగ విడదీయుటకు వీలయినవిగ నిర్మింపబడి యుండుననియు చెప్పుచు తెరలనుగూర్చి యిట్లు చెప్పిరి:

సహజంగా వుండే ఈ తెరల విషయం కొంత చెప్పాలి. భారతదేశంలో నాటకరంగాల మీద చూసే ఈనాటివు తెరల్లాంటి అసహ్యం పుట్టించే వస్తువులు మరెక్కడా చూడబోము. ఎందువల్ల నంటారా? చెప్తా వినండి. చుట్టుముట్టు వీటివల్ల మీకు స్వభావసిద్ధంగా వుండే దృశ్యాన్ని చూడడానికి వీలవుతుంది అనుకుంటే వాట్లో కనబడేంత కృత్రిమం, అస్వాభావికం మరెక్కడా వుండబోదు. తెరల్లో ముఖ్యమైన ప్రధాన భాగం ఏమిట్యా అంటే ఆతెరరాసిన ఏ "నరసింహాచారి"గారి పేరో నడుంగా రాయబడిన భాగం (నవ్వు). అందుచేత దానిముందు మీరు విషాదాంతనాటకాన్ని ఆడితే సుఖాంతంగాను, సుఖాంతనాటకాన్ని ప్రదర్శిస్తే విషాదాంతంగాను మారుతుంటుంది. (నవ్వు) గోడుమవన్నె కాగితం తీసుకోండి. ఒకవైపు నునుపుగా, మెరుగ్గా వుంటుంది; రెండోవైపు గరుగ్గా వుంటుంది. ఒకదానికొకటి అంటించండి. దీంతో మీరు సన్నిమి చేయమంటే అదిచేసి చూపగల్ను. మనోహరంగా, రమణీయంగా, నయనానందకరంగా వుండే వనం చేయమంటారా? ఆకాగితంలోనె ఆకుల్లాగ ముక్కలు కత్తిరించండి. అంతటినీ అందంగా అంటాగ కత్తిరించండి. పసుపు, ఆకుపసుపు రంగుల సన్నని, వుల్లిపొర కాగితం వెనుక భాగంలో అంటించండి. కత్తెరతో దానిపైన కొమ్మలు రెబ్బలు, పువ్వులు గుత్తులూ కత్తిరించండి. దానిమీద ఒక "గాజు" తెర వేయండి. పైనైతే నీలం-బూడిద రంగు, బూడిదరంగు-ఆకుపసుపు రంగుల రెండు 'గాజు' తెరలు వేయండి. వెనుకవైపునుంచి మంచికాంతిగలదీపంతో ఆకులు వెలిగేటట్టుచేయండి.

చిన్నచిన్న విషయాలని గూర్చి, ప్రత్యంశాన్ని గూర్చి నాటికకిగల బాధ్యతను, ప్రాముఖ్యాన్ని గురించి మన మిక తెలుసుకోవాలి. నాయనలారా! ఏమంటె రంగస్థలంమీద కేవలం నటుడే ప్రధానం గాదు. రంగం మీద కనుపించె ప్రతిదీను గూడా గమనింపదగినదై వుంటుంది. ప్రతివాలుగూ, ప్రతికాంతీ, ప్రతిదీపమును, ప్రతి కుర్చి ప్రతివస్తువుకూడా ముఖ్యమైందే.

నటకులు పూసికొనవలసిన రంగులను కట్టవలసిన బట్టలను గూర్చి యిట్లనిరి:

వేషధారణంలో దుస్తులవిషయం చాలాజాగ్రత్త పడవలసి వున్నది. మీరు వేసే నాటకం ఏకాలంలో ఆ కాలపు ఆచారవ్యవహారాల్ని బాగా అవగాహన చేసుకోవాలి. బహదూర్ షా వేషంలో సంపుటాలు (పాదుకలు) వేసుకొనివస్తే లాభం లేదు. మరో విశేష మేమంటె మన భారతదేశంలో నటులెల్లప్పుడూ ముఖాలకి రంగువేసుకుంటేనే కాని పనికిరామని నమ్మతారు. ఎందుకో తెలియదు. పూతమీద పూతగా ముఖాలమీద ఆరంగంతా పులుముకోటం, ఆప్రయాసంతా అనవసరం

గా ఎందుకు పడాలి? అలా రంగుపులిమిన ముఖాలతో మీరు బాగా సున్నం పట్టించిన తమలపాకుల్లాగ వుంటారు. మన భారతీయులకు అద్భుతమైన దేహకాంతి వున్నది. ఇతర దేశస్థులు సైతం ఈ మన దేహ కాంతిని చూచి ఆశపడతారు. అలాంటి స్థితిలో మీ రా శ్వేత ముఖాల్లాగ కనుపించాలని వార్ని అనుసరించడం ఎందుకు? మీ ముఖాన్ని శుభ్రంగా, పరిశుద్ధంగా కడుక్కోండి. నిర్మలినంగా వుంచుకోండి. కొంచెం బలంగా కనుపించాలంటే కొద్దిగా రంగు వేయవచ్చు. రంగులు వేసుకోటం ప్రత్యేకంగా అభ్యసించవలసిన విద్య. అది నేర్చుకుంటే ఒక్క గీతతో ఎలా మార్చుకోవాలంటే, అలా మార్చుకోవచ్చు వేషం.

శ్రుతినిగూర్చి యిట్లు పలికిరి :

హార్మోనియానికి నాటకాల్లో తావు లేకుండా చేయాలని కోరుతూ వున్నాను. హార్మోనియం స్వయంగా నేను వాయించగలను. భారతదేశంలో అపస్వరాలకు, అపభ్రంశపు గొంతుకలకు హార్మోనియం కారణమైనట్టు మరేది కాలేదు.

కాబట్టి మీరు మీ నాటకశాలల్లో తంబుర శ్రుతి పెట్టుకొని పాటసాధన చేయండని నా సలహా. ప్రపంచంలో దాదాపు అన్ని వాద్యాల శబ్దాన్ని నేను విన్నాను. సంగీత శాస్త్రంలో సంపూర్ణగ్రహణశక్తి కొంచెం నాకు వుందనుకు నేవాణ్ణి. కాని ప్రపంచములో వున్న సంగీత సాధనాలన్నిట్లోకి తంబురవంటి సర్వోత్కృష్టమైంది లేదు.

హార్మోనియం మీ కంఠస్వరాల్ని మింగేసి, మీలో అనేకమందిని మంచి గానపాటకులుగ నమ్మింపచేసేట్టు చేస్తుండటంవల్ల దాన్ని వదల లేకుండా వున్నారు.

ప్రకృతము మనకు ఎట్టినాటకము లావశ్యకములు? దీనినిగూర్చి ఉపాధ్యాయగారు

మనకు కొత్తనాటకాలు చాలా అవసరం. మన నాటకాల్లో యిప్పుడు దేవుళ్లు, దేవతలు, రాజులు, రాణులు నిండివుంటారు. వీరందరికి వెంటనే పింఛను యిప్పించి సాగనంపటం చాలాఅవసరం. నీవే దేవుడవని మరువవద్దు. నీలోనే దేవుడున్నాడు. నీ నూతనపథం నీ దారి కడ్డుగానున్న పురాతన సాంప్రదాయాలన్నిటిని ఛేదించేస్తున్నదని నమ్మండి. మానవసమస్యలతో, మనుజమాత్రుల కష్టసుఖాలతో సంబంధం కల నాటకాలు స్వల్పంగావున్న అవే నిజంగా నాటకాలు. మీ రాజమందిరాలు, హంసతూలికాతల్పాలు, ప్రణయకలహాలు, మీ కాఫీలకు సంబంధించినవి కావు. సంఘాన్ని పీడిస్తున్న సమస్యలను చర్చించాలి.

పశ్చిమదేశాల్లో ప్రచారంలోవుండే గొప్పగొప్ప ఉత్తమనాటకాల్ని దేశభాషల్లోకి దిగుమతి చేయటానికి భాషాంతరీకరణసమాజాలు ఏర్పడాలి.

అనిరి. ఠాగూరువారు కళ నిట్లు నిర్వచించిరి :

నాకు కళ అనగా ప్రబోధము. కళ ప్రబోధానికి విరుద్ధము కాదు. ప్రబోధము అనగా ఏమి? ప్రబోధము అన్నప్పుడు సంకుచితమైన జాతీయప్రబోధ మని నా అభిప్రాయం కాదు. నా ప్రబోధము సర్వకాలాబాధితమును శాశ్వతమును నగు ప్రేమస్వరూపము. దానికి ఎల్లలుగాని సరిహద్దులుగాని లేవు. [illegible] దానికి మాతృభాష. అట్టిది నా ప్రబోధము. కళను గురించి మాట్లాడేవారంతా సౌందర్యాన్ని గురించి పలుకుతారు. సూర్యోదయాన్నిగురించి, సూర్యాస్తమయాన్ని గురించి వర్ణించి వర్ణించి విసుగెత్తటం లేదా మనకు? ఎప్పుడూ పక్షుల్ని గురించి, పక్షుల గానాన్ని గురించి వ్రాసివ్రాసి విసుగుపడటం లేదా? అనాకారాన్ని కురూపత్వాన్ని గురించి ఆలోచించారా? అది మీ కంట్లో పడట్లేదా? [illegible]న్ని గురించి ఎన్నడైనా మీరు వ్రాశారా? వధ్యశాలకు కొనిపొయ్యేపశువు పడు ఆవేదనను గురించి వ్రాశారా? శిశువుయొక్క పక్కటెముకల దంతభాగాన్ని గురించి ప్రశంసించారా? మరేమిటి వ్రాశారు? మీరు వ్రాయబోవు నాటకాల కివి కథావస్తువులు గావా? ఈవిషయాలన్నిటినిగూర్చి చదివి, అనుభవించి తెలుసుకోండి! బయటనున్న పరితాపంలో నిండా మునిగి తేలండి!

కన్నీటికాలువలలో ఈవినారాన్ని గొంతుకబట్టతాగండి! పిమ్మట యింట్లకుపోండి! "మొదటితరగతి రైలుబండిలో తల్లో చక్కటి రోజాపువ్వులు తురుముకొన్న ఒక స్త్రీ ...ని" గురించి వ్రాయకండి! ఆవిడ అలా సుఖంగా, అనాయాసంగా ప్రయాణం చేయడానికి అనుకూలంగా ఆ రైలును నిర్మించిన కోట్లకొలది కూలివాండ్రను గురించి రాయండి!

ముందుముందు నాటకసంఘముల నెట్లు ప్రారంభించవలెను? హారీంద్రనాథ్ గారి యభిప్రాయమున నాటకసంఘాలు :

ఆర్గురార్గురు కలసి ఒకచిన్న సమాజంగా బయలు దేరండి. ఒక్కొక్కరు పదిరూపాయలు మూలధనం సంపాదించండి. మీరు శ్రద్ధాభక్తులుగలిగి వుంటే ఏధనికుడైనా మీకామాత్రం సహాయం చేస్తాడు. తెరలు మొదలైన వానికిగాను అందులో రు 50 లు వ్యయపరచండి. కొద్ది కొద్దిగా ప్రారంభం చేయండి. ఏదైనా నూతనంగా కని పెట్టండి. "ఒక పేదవాణ్ణి ఒక ధనికుడు బరువు మోయ మని నిర్బంధపెట్టడం, ఆపేదవాడు మోయలేనని మొత్తు కోవడం, అంత ధనికుడు కండ్లెర్రజేసి కాలాచేత తన్నటం, కొరడాతీసి కొట్టడం..." ఇలాంటి వేదో రాయండి. ఇలాంటివే వేలకొలది ప్రేక్షకులని ఆకర్షి స్తాయి. బహుశా మొదటిరాత్రి రు 200 లు మాత్రమే డబ్బు వసూలు లౌతుం దనుకోండి. ఈరెండు వందల్లో ఒకవందరూపాయలు మీచిన్న నిధిలో వుంచుకొని మిగిలింది ఆర్గురూ సమానంగా పంచుకోండి. దీనివలన వ్యాపార దౌష్ట్యం నశిస్తుంది. దీని మూలంగా మీ కలలు కని, వాటిని రంగంమీద ప్రదర్శించటాని కవకాశం ఏర్పడు తుంది.

తరువాత ఫిల్లెట్గారి నాటకాలను ప్రశంసించినారు. స్త్రీపాత్రములను స్త్రీలే ధరించవలెనన్నారు. పదపడి ప్రతివ్యక్తియు, కళాభివృద్ధికి, తన్మూలమున దేశాభివృద్ధికి, స్వారాజ్యప్రాప్తికి స్వయము స్వార్థరహితమగు సేవను కావింపవలయునన్నారు. వీరియుపదేశము లాచరణ యోగ్యములు.

ఈపరిషత్తువారు చేసిన తీరుమానము లలో ముఖ్యములయినవి :

## తీర్మానములు

విశ్వవిద్యాలయ పఠనప్రణాళికయందు నాట్య విద్యను ఒకపఠనీయ విషయముగా అంగీకరించి ఆంధ్ర నాటకకళాభివృద్ధికి తోడ్పడవలయునని, ఆంధ్ర విశ్వ విద్యాలయమువారిని యీసభవారు ప్రార్థించుచున్నారు.

నాటకసంఘములవారి ప్రయాణ సౌకర్యార్థమై రయిల్వేకంపెనీలవారు సామాజికులకు వారి సామానుల కును తక్కువరేటు ఒసంగవలసినదిగ రైల్వేకంపెనీలవారిని ఈ సభవారు కోరుచున్నారు.

ఆంధ్రదేశములోని నాటకసంఘములవారును, నటకులును, వేషధారణమునకు అవసరములైన రంగులు, దుస్తులు మొదలైన వస్తువులనెల్ల స్వదేశమునందుతయారు చేయబడిన వానినే విధిగ ఉపయోగించి, తద్వారా స్వదేశీపరిశ్రమను ప్రోత్సహింప వలసినదిగ ఈ సభ వారు కోరుచున్నారు.

దేశకాలపరిస్థితుల కనుగుణముగను, నవీనాభిరుచు లనుబట్టి నూతన నాటకముల రచనను ప్రోత్సహించు టకై ప్రతిసంవత్సరమును కనీస మూడు గ్రంథములనైన రచించుటకై గ్రంథకర్తలకు నిధినుండి పారితోషికము లొసంగు ఏర్పాటుచేయవలసినదిగ ఈ సభవారు కోరు చున్నారు.